# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 150 గుంటూరు, సోమవారం 09- 02 - 2026 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349





## మార్చి 31 కల్లా నక్సలిజానికి చెల్లుచీటీ

**రాయ్‌పూర్: ఫిబ్రవరి 08 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** వామపక్ష తీవ్రవాదంపై పోరాటంలో కేంద్రం చేపట్టిన వ్యూహం సత్ఫలితాలను ఇస్తోందని, ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుదముట్టిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా (టూవెడ్ ఛాష్ట్రుస్త్ర) తెలిపారు. మరి కొద్ది వారాల్లో కేంద్రం ప్రకటించిన గడువు ముగుస్తుండటంతో రాయ్‌పూర్‌లో అమిత్‌షా ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. నక్సల్స్ వ్యతిరేక కార్యకలాపాలను సమీక్షించారు. అనంతరం ఆ వివరాలను సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో ఆయన తెలియజేశారు. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, అధికారులతో రాయ్‌పూర్‌లో అదివారంనాడు సమీక్షా సమావేశం జరిపినట్టు అమిత్‌షా తెలిపారు. సెక్యూరిటీ టీమ్‌లను ఏకం చేయడం, మౌలిక వసతుల విస్తరణ, మావోయిస్టుల ఆర్థిక నెట్‌వర్క్‌ను దెబ్బతీయడం, లొంగుబాటు పాలసీలు వంటివి నక్సలిజంపై పోరాటంలో సత్ఫలితాలను ఇచ్చినట్టు చెప్పారు. మార్చి 31వ తేదీలోగా దేశంలో నక్సలిజాన్ని సంపూర్ణంగా

2లో

## పోలవరం ఆశ్రమ పాఠశాలపై ఘటనపై సీఎం సీరియస్

# బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం



**అమరావతి, ఫిబ్రవరి 08 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లా మారేడుమిల్లి మండలం దేవరపల్లి గిరిజన ఆశ్రమ బాలుర వసతి గృహంలో (హాస్టల్) విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులతో ఇవాళ (ఆదివారం) అమరావతిలో సమీక్ష నిర్వహించారు. రేపటిలోగా (ఫిబ్రవరి 9) సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

సీఎం సమీక్ష ద ఆదేశాలు

అమరావతిలోని సచివాలయంలో అధికారులతో ఈ ఘటనపై సమీక్షించిన సీఎం చంద్రబాబు.. విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నారు. ‘హాస్టళ్లలో విద్యార్థులకు ఏమైనా జరిగితే ముందుగా సంబంధిత అధికారులను సస్పెండ్ చేసి, తర్వాతే మిగతా విషయాలు చర్చిస్తాను’ అని ఆయన హెచ్చరించారు. రేపటిలోగా ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆహార నాణ్యత, హైజీన్, వంట సిబ్బంది పర్యవేక్షణపై వివరణాత్మక విశ్లేషణ కావాలన్నారు. నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు (సస్పెన్షన్, డిపార్ట్‌మెంటల్ ఇన్వెస్టిగేషన్) తీసుకోవాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా సరైన ఆహార సరఫరా, ఆరోగ్య పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని హుకుం జారీ చేశారు. ఘటన నేపథ్యం దేవరపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల బాలుర హాస్టల్‌లో 92 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, కడుపు నొప్పి, జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయి. ఇది ఫుడ్ పాయిజనింగ్ వల్లే జరిగినట్టు అధికారులు అంచనా వేశారు. సరిగా వండని.. ఇడ్లీ, సాంబార్.. వంటి ఆహారం వడ్డించడం లేదా హైజీన్ లోపాల వల్ల ఇది జరిగినట్టు ప్రాథమికంగా తేలింది. అస్వస్థత తీవ్రమవడంతో విద్యార్థులను మొదట మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, తర్వాత రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం వారందరూ చికిత్స పొందుతున్నారు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని ఆసుపత్రి అధికారులు తెలిపారు.




# నేడు సీఎం సత్తా:

### మంత్రులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం

**అమరావతి, ఫిబ్రవరి 08 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రేపు మంత్రులు, కార్యదర్శుల సమీక్ష సమావేశం జరుగనుంది. సచివాలయంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6.30 వరకు ఈ సమీక్ష కొనసాగనుంది. ఈ సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు ప్రత్యక్షంగా హాజరవుతారు, అలాగే జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్ ఫార్మాట్‌లో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి జీఎస్డీపీ వృద్ధి రేటు, “స్వర్ణాంధ్ర 2047” విజన్ లక్ష్యాల క్రింద పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖలు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను సమీక్షించనున్నారు. అంతేకాదు, రాష్ట్రంలో వచ్చిన పెట్టుబడులు, ప్రస్తుతం చేపట్టిన పీపీపీ ప్రాజెక్టుల పురోగతి అంశాలపై కూడా చర్చ జరుగనుంది. రియల్ టైమ్ గవర్నెన్స్ విధానం భాగంగా, అవేర్, డేటా అనలిటిక్స్, ఏఐ టూల్స్ వంటి సాంకేతికతలను పాలనలో ఎలా వినియోగించాలో ముఖ్యమంత్రి దిశానిర్దేశం ఇవ్వనున్నారు. రాష్ట్ర యువతకు నైపుణ్యాభివృద్ధి, “వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్” విధానం అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, అలాగే రాష్ట్ర శాంతిభద్రతల అంశాలపై కూడా సమీక్ష జరుగనుంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి శాఖలు తీసుకోవాల్సిన కార్యాచరణ, చేరుకోవాల్సిన లక్ష్యాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు స్పష్టమైన మార్గనిర్దేశం అందిస్తారు.

# ఏపీలో మళ్లీ బర్డ్ ఫ్లూ కలకలం..

## ఆ జిల్లాలో వైరస్ పంజా, 28 వేల కోళ్లు మృతి




**అమరావతి, ఫిబ్రవరి 08 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఏపీలో బర్డ్ ఫ్లూ వైరస్ మరోసారి పంజా విసురుతోంది. చిత్తూరు జిల్లా సదుం మండలంలోని పుట్టవారి పల్లి, అమ్మగారిపల్లి, కంభంవారి పల్లి గ్రామాల్లో ఉన్న కోళ్ల ఫారాల్లో గత వారం రోజులుగా వేల సంఖ్యలో కోళ్లు మరణిస్తున్నాయి. స్థానిక పశు సంవర్ధక శాఖ అధికారులు చేపట్టిన ప్రాథమిక పరీక్షల్లో వీటికి బర్డ్ ఫ్లూ వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో యంత్రాంగం అప్రమత్తమైంది. మండలంలోని మూడు ప్రధాన కోళ్ల ఫారాల్లో సుమారు 28 వేల కోళ్లు వైరస్ బారిన పడి చనిపోయినట్లు తెలిసింది. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండటంతో.. వైరస్ ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

ఇందులో భాగంగా ప్రస్తుతం బతికున్న కోళ్లను కూడా నిర్మూలించే ప్రక్రియను చేపట్టారు. ఊరి వెలుపల జేసీబీ సాయంతో భారీ గుంతలు తీసి.. శాస్త్రీయ పద్ధతిలో వాటిని పూడ్చివేస్తున్నారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మార్వో స్పందిస్తూ.. వ్యాధి ప్రబలిన మూడు కోళ్ల ఫారాలను తక్షణమే సీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఎవరూ ఆ ప్రాంతంలోకి వెళ్లకుండా ఆంక్షలు విధించినట్లు తెలిపారు. ప్రజారోగ్యాన్ని

2లో

## జగన్‌కు సూటి ప్రశ్నలు వేసిన నాగబాబు..

**అమరావతి, ఫిబ్రవరి 08 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** : కులం అనేది బై బర్త్.. కానీ బై ఛాయిస్ కాదని జనసేన పార్టీ ఎమ్మెల్సీ కె.నాగబాబు స్పష్టం చేశారు. కానీ ఎలా బతకాలో మనం నిర్ణయించుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో ప్రాక్టికల్‌గా ఉంటూ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మాట్లాడాలని అభిప్రాయపడ్డారు. ఆదివారం నాడు తన ఎక్స్ ఖాతా వేదికగా వీడియో విడుదల చేసిన ఎమ్మెల్సీ నాగబాబు.. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌తోపాటు ఆ పార్టీ నేతలకు పలు ప్రశ్నలు సంధించారు. ఆయన ఏమన్నారంటే.. ‘పెద్ద సంఖ్యలో ఉన్న కులాలు.. చిన్న సంఖ్యలో ఉన్న కులాల వారిని ప్రోత్సహించాలని, అప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని పవన్ కళ్యాణ్ చెప్పారు. రాష్ట్రంలో అధిక శాతం ఉన్న కాపులు పెద్దన్న పాత్ర పోషించాలని పవన్ ప్రకటించారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో నలభై శాతం కాపులు ఉన్నప్పటికీ.. బీసీ సోదరుడు కొణతాల రామకృష్ణకు టికెట్ ఇచ్చారు. కాపులు, బీసీలు కలిసి పని చేసి రామకృష్ణను గెలిపించుకున్నారు.’

‘విశాఖపట్నం సౌత్‌లో కూడా కుల సమీకరణలు పక్కన పెట్టి బీసీ యాదవ సోదరుడు వంశీ కృష్ణకి సీటు ఇచ్చారు. కులాలను పక్కన పెట్టి.. అందరూ సమానమనే భావనతో పవన్ ముందుకు సాగుతున్నారు. వైసీపీ నాయకులకు ముని శాపం ఉంది.. వారు నిజాలు చెబితే.. తల వెయ్యి ముక్కలయ్యి



2లో



### బాబాయ్ నిజం ఒప్పుకున్నాడు..

# అబ్బాయ్ ఎప్పుడు?

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 08 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారంలో టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీడీపీ ఎంపీ అప్పలనాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నెయ్యి కల్తీ జరిగిందని ఇప్పటికైనా వైవీ సుబ్బారెడ్డి అంగీకరించడం సంతోషకరమని, అయితే ఆయన చెబుతున్న కుంటి సాకులు విడ్డూరంగా ఉన్నాయని ఆయన ఇవాళ ఢిల్లీలో విమర్శించారు.

నిజాలు ఒప్పుకున్న బాబాయ్.. జగన్ సమాధానం చెప్పాలి ఢిల్లీలో మీడియాలో మాట్లాడిన ఎంపీ అప్పలనాయుడు, వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలపై పలు ప్రశ్నలు సంధించారు. ‘బాబాయ్ నిజాలు ఒప్పుకున్నారు, మరి అబ్బాయ్ (జగన్) ఇప్పుడేమంటారు? తప్పు జరిగిన మాట వాస్తవం కాబట్టి జగన్ వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలి’ అని అప్పల నాయుడు డిమాండ్ చేశారు. సీఎఫ్‌టీఆర్ఐ కి నెయ్యి శాంపిళ్లు పంపినట్లు అంగీకరించిన సుబ్బారెడ్డి, దాని రిపోర్టు గురించి తనకు తెలియదనడం పచ్చి అబద్ధమని మండిపడ్డారు. ఆ నివేదికను సుబ్బారెడ్డి కావాలనే తొక్కిపెట్టారని ఆరోపించారు.

నకిలీ నెయ్యి వెనుక అసలు నిజం ఇదే..

నిబంధనలు సడలించి నాణ్యత పెంచామన్న సుబ్బారెడ్డి మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎంపీ ఎద్దేవా చేశారు. ‘నిబంధనలు సడలించబట్టే కదా.. భోలేబాబా డెయిరీ లక్షల కిలోల నకిలీ నెయ్యిని తిరుమలకు సరఫరా చేసింది! దీనికి సుబ్బారెడ్డి

2లో

### అంబటి రాంబాబుకు బిగ్ షాక్..

# పీటీ వారెంట్ జారీ



**గుంటూరు జిల్లా, ఫిబ్రవరి 08 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత అంబటి రాంబాబు కేసుకు సంబంధించి

2లో

## లడ్డూపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్న మంత్రి నాదెండ్ల




**ఫిబ్రవరి 08 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** తిరుమల లడ్డు నెయ్యి కల్తీ వివాదంపై ప్రతి హిందూ భక్తుడు ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. భక్తుల మనోభావాలను గౌరవించడమే నిజమైన ధర్మరక్షణ అని, ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీకో సంబంధించిన అంశం కాదని, కోట్లాది మంది విశ్వాసాలతో ముడిపడిన అత్యంత సున్నితమైన విషయమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యవహారాన్ని రాజకీయ కక్షసాధింపుగా మార్చేందుకు వైసీపీ చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. తిరుమల లడ్డులో కల్తీ జరిగిందన్న అంశంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగిన విచారణలో సీబీఐ సమర్పించిన నివేదిక

2లో

## మార్చి 31 కల్లా నక్సలిజానికి చెల్లుచీటీ : అమిత్‌షా

నిర్మూలిస్తామని వివరించారు.రాయ్‌పూర్ అటల్ నగర్‌లోని ఒక హోటల్‌లో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ, కేంద్ర హోం కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, హోం వ్యవహారాల శాఖ స్పెషల్ సెక్రటరీ (అంతర్గత భద్రత) తదితరులు పాల్గొన్నారు. సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్స్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, జార్ఖండ్, తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

2024 నుంచి.. ఛత్తీస్‌గఢ్‌లో 2024 నుంచి సెక్యూరిటీ బలగాలు పైచేయి సాధించాయి. 500 మందికి పైగా నక్సలైట్లు ఎన్‌కౌంటర్లలో హతమయ్యారు. వీరిలో సీపీఐ (మావోయిస్టు) సీనియర్ నేత, ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ రావు (బసవరాజు) సహా పలువురు కీలక నేతలున్నారు. ఇదే సమయంలో సుమారు 1,900 మంది నక్సల్స్‌ను అరెస్టు చేయగా, 2,500 మంది లొంగిపోయారు.

## బాబాయ్ నిజం ఒప్పుకున్నాడు.. అబ్బాయ్ ఎప్పుడు?:

ఏం సమాధానం చెబుతారు?' అని ఎంపీ ప్రశ్నించారు.

మహా అపచారానికి పశ్చాత్తాపం లేదా?

శ్రీవారి లడ్డూ విషయంలో ఇంతటి మహా అపచారం జరిగినా, పశ్చాత్తాపం లేకుండా వైవీ సుబ్బారెడ్డి ఇంకా బుకాయిస్తుండటం విస్మయానికి గురి చేస్తోందని ఎంపీ అప్పల నాయుడు అన్నారు. టీటీడీ మాజీ ఛైర్మన్ చెబుతున్న చిలకపలుకులను ప్రజలెవరూ నమ్మే స్థితిలో లేరని, దోషులు కచ్చితంగా శిక్ష అనుభవించాల్సిందేనని అప్పలనాయుడు తేల్చిచెప్పారు.

## ఏపీలో మళ్లీ బర్డ్ ఫ్లూ కలకలం.. ఆ జిల్లాలో వైరస్ పంజా, 28 వేల కోళ్లు మృతి

దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోళ్ల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారవేయవద్దని ఎమ్మార్వో సూచించారు.

రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ కేసులు రావడం ఇది మొదటిసారి కాదు. గతంలోనూ గోదావరి జిల్లాలు, నెల్లూరు, కోస్తా జిల్లాల్లో ఈ వైరస్ కారణంగా లక్షలాది కోళ్ల ప్రాణాలు కోల్పోయాయి, తద్వారా పౌల్ట్రీ రంగం కోలుకోలేని విధంగా దెబ్బతింది. ఈ వైరస్ మానవులకు కూడా సోకే ప్రమాదం ఉండటంతో వైద్య ఆరోగ్య శాఖ కూడా హై అలర్ట్ ప్రకటించింది. పౌల్ట్రీ ఫారాల యజమానులు బయో-సెక్యూరిటీ చర్యలు పెంచాలని సూచించింది. కోళ్లు అసాధారణంగా చనిపోతుంటే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించింది. బర్డ్ ఫ్లూ సోకిన ప్రాంతాలు, ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మాంసం, గుడ్లు వినియోగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని రోజుల పాటు చికెన్ తినకపోవటమే ఉత్తమమని చెబుతున్నారు.

## జగన్‌కు సూటి ప్రశ్నలు వేసిన నాగబాబు..

చస్తారు. నోరు విప్పితే చాలు.. అబద్దాలు.. బూతులు.. ఇవే వారికి తెలుసు. చిన్న అవకాశం వచ్చినా కులాలను రెచ్చగొట్టి.. కుల రాజకీయాలు చేయడం వారికి వెన్నతో పెట్టిన విద్య. ముఖ్యమంత్రిని బండ బూతులు తిడితే జైల్లో పెట్టక ముద్దు పెట్టుకుంటారా?. ఇలాంటి వారికి కులాన్ని ఆపాదించి కుల చిచ్చు పెట్టేవారిని కూడా అరెస్టు చేస్తే దరిద్రం వదలిపోతుంది. కాపులు తాగుబోతులు, తిరుగుబోతులు అని పిచ్చిపిచ్చిగా మాట్లాడే అంబటి రాంబాబు లాంటి వాడిని రంగా బొమ్మ పక్కన రాంబాబు బొమ్మ పెట్టిన వైసీపీ నేతలను నేను కొన్ని ప్రశ్నలు అడుగుతున్నా..? 2024 ఎన్నికలలో గ్రేటర్ రాయలసీమ ప్రాంతాలలో కాపు, బలిజలు 20 శాతం వరకు ఉన్నా ఒక్క ఎంపీ సీటు ఇవ్వలేదు. 74 అసెంబ్లీ సీట్లలో ఒకే ఒక్క సీటు మాత్రమే కాపులకు ఇచ్చారు.' 'మరి పేర్ని నానీ, అంబటి రాంబాబు వంటి వారు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను ప్రశ్నించారా?. రాజంపేట బలిజలు ప్రాతినిధ్యం వహిస్తున్న సీటు.. సాయి ప్రతాప్ అక్కడ నుంచే కేంద్రమంత్రి అయ్యారు. జగన్ ఆ తర్వాత మిథున్ రెడ్డికి ఈ సీటు ఇస్తే.. టైగర్ అంబటి, లయన్ పేర్ని నానీ ఎక్కడ నిద్రపోయారు?. మీకు అంత ధైర్యం ఉంటే.. అసలు మీరు ఆ పార్టీలో ఎందుకుంటారు. పిఠాపురంలో మిథున్ రెడ్డిని పెట్టి పవన్ కళ్యాణ్‌ను ఓడించేందుకు తెగ పాకులాడారు. ఇప్పుడు మిథున్ రెడ్డిని కాకుండా మీతో ఎందుకు మాట్లాడిస్తున్నారు.. మీకు ఆలోచించే బుర్ర ఉందా? అసలు వంగవీటి రంగా ఫొటో పక్కన అంబటి ఫొటో పెట్టమని చెప్పిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయండి. మీ 11 సీట్లలో ఆరు సీట్లు పోయే ఐడియా ఇది. రంగా గారిపై అభిమానం ఉంటే.. వారి అబ్బాయి రాధాకు సీటు ఇవ్వకుండా బయటకు ఎలా పంపారు."రంగాని తిట్టిన గౌతంరెడ్డికి సీటు ఇవ్వడమే కాకుండా.. ఫైబర్ నెట్ ఛైర్మన్‌ను చేసింది జగన్ కాదా? కాపులు అని చెప్పుకుంటూ... జగన్‌ను సపోర్టు చేసేవారిని ఒక్కటే అడుగుతున్నా.. కాపు నేస్తం పథకానికి జగన్ పేరు పెట్టుకున్నప్పుడు ఈ సో కాల్డ్ కాపులు ఏమయ్యారు?. ఏం జగనన్నా .. మాకు సీకే నాయుడు, కోడి రామ్మూర్తినాయుడు వంటి కాపు లీడర్లు లేరా.. వారి పేర్లు ఎందుకు పెట్టలేదని ఎప్పుడైనా అడిగారా? కాపులను మోసం చేసిన జగన్‌ను ముందు ప్రశ్నించి.. ఆ తర్వాత పవన్‌ను అడగండి. ఇది జెన్‌జీ జనరేషన్.. కుర్రాళ్లు యమ స్పీడుగా ఉన్నారు. మీరు ఇంకా రాంబాబు రాంబాబు అంటూ రాజనాల నాటి రాజకీయమే చేస్తామంటే.. ఈ సారి 11 సీట్లు కూడా రావు..' అంటూ జనసేన పార్టీ నేత, ఎమ్మెల్సీ కె.నాగబాబు పేర్కొన్నారు.

## అంబటి రాంబాబుకు బిగ్ షాక్.. పీటీ వారెంట్ జారీ

పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. గతేడాది నవంబర్ 12న మెడికల్ కాలేజీల పీపీపీ మోడల్‌ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన అంబటి.. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు తోసుకుని వెళ్లారు. ఈ ఘటనపై అప్పట్లోనే పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. అంబటి రాంబాబు అప్పట్లో పోలీసులు అడ్డుకున్నా.. బారికేడ్లను తోసుకుని ఆందోళనలో పాల్గొన్నారని, ఈ విషయంపై కేసు దర్యాప్తు జరుగుతోందని పోలీసులు పీటీ వారెంట్ లో ప్రస్తావించారు. కోర్టుకు అంబటి.. పోలీసులు ఈనెల (ఫిబ్రవరి) 11వ తేదీ లోపు అంబటి రాంబాబును కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. దీంతో అంబటిని రేపు(సోమవారం) మొబైల్ కోర్టులో ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం. అంబటి రాంబాబుకు సంబంధించిన కస్టడీ పిటిషన్‌పై రేపు మొబైల్ కోర్టు తీర్పు ప్రకటించనుంది.

## లడ్డూపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్న మంత్రి నాదెండ్ల

వాస్తవాలను వెలుగులోకి తెచ్చిందని మంత్రి గుర్తుచేశారు. 60 లక్షల లీటర్ల నెయ్యిలో ఒక్క చుక్క కూడా అసలైన నెయ్యి లేదని నివేదిక స్పష్టం చేసిన తర్వాత కూడా వైసీపీ నాయకులు ఎదురుదాడి చేయడం దుర్మార్గం. వారికి ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు లేదు అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.అయోధ్యకు పంపిన లడ్డూల కోసం 'ప్రత్యేక నెయ్యి' వాడామని వైసీపీ నేతలు చెప్పడమే, తిరుమలలో వాడే నెయ్యి నాణ్యమైనది కాదని వారికి ముందే తెలుసనడానికి నిదర్శనం అని మనోహర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్, పలమనేరు నుంచి ప్రత్యేకంగా నెయ్యి తెప్పించి అయోధ్యకు లడ్డూలు పంపామని చెప్పడం ద్వారా ఐదేళ్లుగా మిగిలిన లడ్డూల తయారీలో ప్రజలను ఎలా మోసం చేశారో వారే అంగీకరించినట్టయిందని ఆయన విమర్శించారు.ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై వ్యక్తిగత దాడులుగా మలచాలని చూస్తున్నారని, సమాజం ఈ కుట్రను గమనించాలని కోరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచన ఎల్లప్పుడూ హిందూ ధర్మాన్ని కాపాడటమే తప్ప, ఇతర మతాలను కించపరచడం కాదని ఆయన స్పష్టం చేశారు. తప్పు జరిగిందని అంగీకరించి క్షమాపణ చెప్పాల్సింది పోయి, ప్రెస్ మీట్లు పెట్టి ఎదురుదాడి చేయడం వారి పైశాచిక ఆనందానికి నిదర్శనమని అన్నారు.ఈ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా పరిగణించి, మఠాధిపతులు, పీఠాధిపతులు, ధార్మిక పెద్దలతో ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి వాస్తవాలను వెలికి తీయాల్సిన అవసరం ఉందని మంత్రి మనోహర్ అభిప్రాయపడ్డారు.

## పల్నాడు జిల్లా :- నరసరావుపేట లో సర్వమత సమగ్రతా నడక కార్యక్రమం.






ఎమ్ ఎ ఎమ్ విద్యాసంస్థలు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, పల్నాడు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 5కే వాక్...

నరసరావుపేటలోని టౌన్ చర్చి నుంచి ఇస్సాపాలెం మహంకాళి అమ్మవారి దేవస్థానం వరకు నిర్వహించిన ర్యాలీ...

దారి మధ్యలో మసీదు, చర్చి, అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రార్థనలు...

అన్ని మతాలు కులాలు ఒకటే అని నినాదంతో నిర్వహించిన 5కే వాక్...

ర్యాలీలో భారీగా హాజరైన ఎంఏఎం విద్యాసంస్థల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, పల్నాడు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు, పట్టణ ప్రముఖులు..

## పార్టీని నమ్ముకుంటే చివరకు అవమానమే మిగిలింది






**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** పెదకూరపాడు మండలం జలాలపురం గ్రామానికి చెందిన సరిపూడి రామారావు ఆదివారం తన ప్రాథమిక టిడిపి సభ్యత్వానికి రాజీనామా చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపిలో ఉన్నామని కొత్తగా కొత్త నాయకులు వచ్చి తమకంటూ గుర్తింపు పూర్తిగా లేకుండా పోయిందని ఆయన వాపోయారు. గత నాలుగు నెలల క్రితం తనపై దాడి జరిగి హత్యయత్నం చేసినప్పటికీ పార్టీ అధినాయకుడు గానీ మండల నాయకులు గానీ, గ్రామ నాయకులు గానీ కనీసం పరామర్శించటం కూడా జరగలేదన్నారు. చట్టం కూడా కొత్త నాయకులకే చుట్టంగా మారిందని అందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. సుమారు 100 కుటుంబాల వరకు తన వెంట వస్తాయన్నారు. పార్టీని గతంలో బ్రతికించి నిలబెట్టిన ఘనత తనదైనప్పటికీ కొత్త రాజకీయ నాయకులకి అవకాశాలు ఇచ్చి పార్టీని నమ్ముకున్న సీనియర్ నాయకులకు చుక్కెదురు చూపిస్తున్నారని ఆయన అన్నారు. తన రక్తంలో కూడా టిడిపి పార్టీ ప్రవహిస్తుందని అలాంటి తనకే ఎదురు దెబ్బ తగిలిందని అందుకే ప్రాథమికంగా సభ్యత్వానికి రాజీనామా చేసి మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరు బ్రహ్మయ్య కు అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తు కాలంలో తన నిర్ణయాన్ని మరల తెలియజేస్తానని రామారావు తెలిపారు.

## గుంటూరులో వైసీపీ కొత్త వ్యూహం..?



**క్రైమ్ కౌంటర్ న్యూస్...** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వైసీపీ ఇంఛార్జి గా అంబటి మౌనిక పేరు ఖరారు చేయనున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవికి చెక్ పెట్టే వ్యూహంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. త్వరలోనే ఈ అంశంపై పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ అధికారిక ప్రకటన చేస్తారని జిల్లాలో టాక్.కాగా పశ్చిమ నియోజకవర్గంలో ప్రస్తుతం వైసీపీకి ఇంఛార్జి లేరు...

## కులాలను కలపడమే జనసేన సిద్ధాంతమని నాగబాబు స్పష్టీకరణ



**ఫిబ్రవరి 08 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** జనసేన పార్టీ ఎమ్మెల్సీ నాగబాబు, వైసీపీ నేతలపై, ముఖ్యంగా ఆ పార్టీలోని కాపు నాయకులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కులాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూసే వైసీపీ నేతలకు కాలం చెల్లిందని, ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఇప్పుడున్న 11 సీట్లు కూడా దక్కవని ఆయన హెచ్చరించారు. జనసేన సిద్ధాంతాలను వివరిస్తూనే, వైసీపీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగడుతూ ఆయన పలు సూటి ప్రశ్నలు సంధించారు.ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ మన దేశంలో కులం అనేది ఒక సామాజిక వాస్తవికత. ఎవరు ఏ కులంలో పుడతారో, దాన్ని ఎప్పటికీ మార్చుకోలేం. కుల రహిత సమాజం అనేది ఒక ఉన్నతమైన ఆశయమే అయినా, రాజకీయాల్లో వాస్తవ పరిస్థితులను అంగీకరించాలి. అందుకే పవన్ కల్యాణ్ గారు 'కులాలను కలిపే ఆలోచనా విధానాన్ని జనసేన మూల సిద్ధాంతాల్లో ఒకటిగా చేర్చారు. సమాజంలో అధిక సంఖ్యలో ఉన్న కులాలు, అల్పసంఖ్యాక కులాలను ప్రోత్సహించి పెద్దన్న పాత్ర పోషించాలి అని అన్నారు. ఇందుకు ఉదాహరణగా, 40 శాతం కాపు జనాభా ఉన్న అనకాపల్లి స్థానాన్ని బీసీ వర్గానికి చెందిన కొనతాల రామకృష్ణకు కేటాయించామని, అక్కడ కాపులు, గౌరలు కలిసి పనిచేసి ఆ సీటును గెలిపించుకున్నారని గుర్తుచేశారు. అలాగే, విశాఖ సౌత్‌లో బీసీ యాదవ వర్గానికి చెందిన వంశీకృష్ణ యాదవ్‌కు టికెట్ ఇవ్వగా రాష్ట్రంలోనే అత్యధిక ఓట్ల శాతంతో గెలిచారని, ఇది తమ సిద్ధాంత నిబద్ధతకు నిదర్శనమని నాగబాబు స్పష్టం చేశారు.వైసీపీ నేతలపై విమర్శలు గుప్పిస్తూ నిజం మాట్లాడితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం వైసీపీ నేతలకు ఉంది. వారు నోరు విప్పితే అబద్ధాలు, బూతులు తప్ప మరేమీ రావు. తాగుబోతులు, తిరుగుబోతులు అంటూ కాపు కులాన్ని కించపరిచే అంబటి రాంబాబు వంటి వారిని, వంగవీటి రంగా గారి ఫొటో పక్కన పెట్టి కాపు కుల ఐకాన్‌గా చూపాలని చూశారు. మీ ఈ ఆలోచనే మిమ్మల్ని ముంచింది అని దుయ్యబట్టారు.ఈ క్రమంలో వైసీపీ కాపు నేతలను ఉద్దేశించి నాగబాబు పలు ప్రశ్నలు లేవనెత్తారు.గ్రేటర్ రాయలసీమలోని 6 జిల్లాల్లో 20 శాతం బలిజ, కాపులు ఉన్నా ఒక్క ఎంపీ సీటు, 74 అసెంబ్లీ సీట్లలో పర్చూరు తప్ప ఒక్క సీటూ ఎందుకు ఇవ్వలేదు దీనిపై అంబటి, పేర్ని నాని వంటి వారు జగన్‌ను ఎప్పుడైనా ప్రశ్నించారా తరతరాలుగా బలిజలు గెలుస్తున్న రాజంపేట ఎంపీ సీటును మిథున్ రెడ్డికి కట్టబెట్టినప్పుడు మీరెక్కడ ఉన్నారు అని నిలదీశారు. వంగవీటి రంగా గారిపై వైసీపీది కపట ప్రేమ అని, ఆయన కుమారుడు రాధాను పార్టీ నుంచి పంపించి, రంగా గారిని దూషించిన గౌతం రెడ్డికి పదవి కట్టబెట్టారని ఆరోపించారు. 'కాపు నేస్తం' పథకానికి వైఎస్సార్ పేరు పెట్టినప్పుడు, కాపు కులంలో పుట్టిన మహానుభావుల పేర్లు పెట్టాలని మీ నాయకుడిని ఎప్పుడైనా అడిగారా అని ప్రశ్నించారు.ఇది జెన్?జి తరం. మీరు ఇంకా రాజనాల కాలం నాటి కుల రాజకీయాలు చేస్తే, ఈ 11 సీట్లు కూడా మిగలవు. ఆలోచించుకోండి అని నాగబాబు హితవు పలికారు

# స్విమ్మింగ్ లో తండ్రి కొడుకులు సూపర్






**క్రైం కౌంటర్ కోటేశ్వరరావు పెద్దకూరపాడు న్యూస్ :** తండ్రి రక్షణ శాఖలో హెడ్ కానిస్టేబుల్ అతని కుమారుడు 10 సంవత్సరాలు వయసు కలిగి ఆరో తరగతి చదువుతున్నాడు . కానీ తండ్రి బిడ్డకు ఆరోగ్య సూత్రాలను చిన్నతనం నుండి నూరి పోశారు . వివరాల్లోకెళ్తే పెదకూరపాడు పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న రాజేష్ నాయక్ ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ వ్యాయామ అలవాట్లు అయినా ధ్యానం, యోగ , వాకింగ్, తో పాటు సిమ్మింగ్ లో కూడా తన కుమారుడు ప్రతిభ చాటాలని సంకల్పించాడు . విజయవాడ ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 26వ కృష్ణా రివర్ క్రాస్ ఈతల పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన ను కనబరిచారు . ఈ పోటీలలో తండ్రి రాజేష్ నాయక్ వన్ పాయింట్ ఫైవ్ కిలోమీటర్లను 26 నిమిషాల్లో ఈదాడు 10 సంవత్సరాలు కలిగిన తన కుమారుడు శక్తి స్వరూప్ ఒకటి పాయింట్ ఐదు కిలోమీటర్లను 30 నిమిషాల్లో ఈ దాడు . ఇరువురు లక్ష్యాన్ని చేరుకున్నారు తండ్రి కొడుకుల అత్యుత్తమ ప్రదర్శనకు పలువురు ముగ్గులయ్యే అభినందించారు . ఇరికి ఫైర్ డీజీ వెంకటరమణ ప్రశంస పత్రాన్ని అందించారు . ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణ కార్యదర్శి యార్లగడ్డ వెంకట రమేష్ కుమార్ పెదకూరపాడు ఎస్సై గిరిబాబు తన తోటి సిబ్బంది అభినందనలు తెలిపారు

## మాచర్ల సీఐ మానవత్వం: తప్పిపోయిన చిన్నారిని తల్లి చెంతకు చేర్చిన: మాచర్ల పట్టణ సిఐ తురక వెంకటరమణ




**క్రైం కౌంటర్ న్యూస్ మాచర్ల.పులిమెల మాణిక్యం.** పల్నాడు జిల్లా, మాచర్లలో బాధ్యతాయుతమైన విధి నిర్వహణతో పాటు మానవత్వాన్ని చాటుకున్నారు పట్టణ సీఐ తురక వెంకటరమణ.దారి తప్పి ఆందోళనలో ఉన్న ఏడేళ్ల చిన్నారిని గుర్తించి,క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించి అందరి ప్రశంసలు అందుకున్నారు.గురజాల గ్రామానికి చెందిన పరస ప్రకాష్ కుమార్తె కావ్య (7) దారి తప్పిపోయింది. చిన్నారి ఆచూకీ తెలియక తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్న సమయంలో, విషయం తెలుసుకున్న సీఐ వెంకటరమణ తక్షణమే స్పందించారు.పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి,చిన్నారి క్షేమంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం చిన్నారి తల్లి పరస అన్నమ్మను పిలిపించి, పాపను ఆమెకు అప్పగించారు. కళ్లెదుట తమ బిడ్డను చూడగానే ఆ తల్లిదండ్రులు ఆనంద బాష్పాలతో సీఐకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రద్దీ ప్రదేశాల్లో మరియు ప్రయాణాల్లో చిన్న పిల్లల పట్ల

# గ్రామీణ రోడ్లకు మహర్దశ రూ.6.31 కోట్లు మంజూరైన దేవరాపల్లి నుంచి వాలాబు మీదుగా కోనాం వెళ్లే రోడ్డు

**పీఆర్ ప్రాజెక్టు విశాఖ డివిజన్‌లో 98 రహదారుల అభివృద్ధి**

**మొత్తం 267.68 కి.మీ.ల పొడవు, రూ.117.08 కోట్లు మంజూరు**

**అనకాపల్లి జిల్లాలో 81, విశాఖ జిల్లాలో 17 రహదారుల**

**త్వరలో టెండర్లు.. ఆరు నెలల్లో పనులు పూర్తి**

**క్రైమ్ కౌంటర్ న్యూస్):** విశాఖపట్నం, ఫిబ్రవవరి 8పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లో ఛిద్రమై, అధ్వానంగా మారిన రోడ్లకు దశ మారనున్నది. మహర్దశపట్టింది. ఏపీ రూరల్ రోడ్స్ స్ట్రెంథనింగ్ ప్రాజెక్టు(ఏపీఆర్ఆర్ఎస్పీ) కింద విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలో మొత్తం 98 రహదారులను అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. మొత్తం 267.68 కి.మీ.ల పొడవైన రహదారులను పటిష్ఠం చేయడానికి రూ.117.08 కోట్లు మంజూరుచేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. త్వరలో టెండర్ల ప్రక్రియను చేపట్టి, ఆరు నెలల్లో పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

గత వైసీపీ ఐదేళ్ల పాలనో గ్రామీణ రహదారులు ఎంత అధ్వానంగా వున్నాయో అందరికీ తెలిసిందే. ఒక్క ఏడాది కూడా నిర్వహణ, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకపోవడంతో క్రమేపీ గోతులు పెద్దవై, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. రహదారులపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి, వర్షం కురిస్తే నీరు నిలిచిపోయి పంట కుంటలను తలపించాయి. కొన్ని మార్గాల్లో రాళ్లు లేచిపోయి కనీసం నడిచి వెళ్లడానికి కూడా వీలు కాని విధంగా రహదారులు వుండేవి. రోడ్లను బాగు చేయించాలని ప్రజలు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా.. నాటి వైసీపీ పాలకులు పెడచెవిన పెట్టారు. ఏడాదిన్నర క్రితం కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. స్థానిక ఎమ్మెల్యేలు ఇచ్చిన ప్రతిపాదనల మేరకు కేంద్రం ఇచ్చే గ్రాంట్లతోపాటు రాష్ట్ర ప్రభుత్వం మరికొంత నిధులు సమకూర్చనున్నది. దీనిలో భాగంగానే ఏపీ రూరల్ రోడ్స్ స్ట్రెంథనింగ్ ప్రాజెక్టు (ఏపీఆర్ఆర్ఎస్పీ) కింద పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ప్రాజెక్టు డివిజన్ పరిధిలోని విశాఖపట్నం జిల్లాలో 17 రోడ్లు, అనకాపల్లి జిల్లాలో 81 రోడ్లు వున్నాయి. మొత్తం 267.68 కి.మీ.ల పొడవైన 98 రహదారులకు అభివృద్ధి/ మరమ్మతు పనులకు రూ.117.08 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో అనకాపల్లి జిల్లాలో 226.40 కి.మీ.ల పొడవైన రోడ్లకు రూ.99.63 కోట్లు, విశాఖ జిల్లాలో 41.28 కి.మీ.ల పొడవైన రోడ్లకు రూ.17.45 కోట్లు కేటాయించారు. త్వరలో టెండర్లు పిలిచి, ఆరు నెలల్లో పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

అనకాపల్లి జిల్లాలోని రహదారుల్లో కొన్ని..

అనకాపల్లి మండలం కూండ్రం- బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం మధ్య 1.985 కి.మీ.ల రహదారికి రూ.1.14 కోట్లు

చోడవరం మండలం పీఎస్‌పేట నుంచి తిమ్మనపాలెం, పోలేపల్లి మీదుగా ఆర్ఈసీ రోడ్డుకు రూ.5.11 కోట్లు

చోడవరం మండలం గోవాడ నుంచి అంభేరుపురం మీదుగా ఆర్ఆర్‌పేట వరకు రూ.2 కోట్లు

కశింకోట- బంగారుమెట్ట (కేబీ) రోడ్డు నుంచి పెదమదీనా, గునిపూడి మీదుగా ఆర్ఈసీ వరకు రూ.1.6 కోట్లు

దేవరాపల్లి నుంచి వాలాబు మీదుగా చీడికాడ మండలం కోనాం వరకు 12.35 కి.మీ.ల రహదారికి రూ.6.31 కోట్లు



నక్కపల్లి మండలంలో జాతీయ రహదారిపై గొడిచర్ల జంక్షన్ నుంచి జి.జగన్నాథపురం మీదుగా గిరిజన గ్రామం చీడిక వరకు 6.458 కి.మీ.ల రోడ్డుకు రూ.2 కోట్లతో మరమ్మతు పనులు

కోటవురట్ల మండలంలో గొట్టివాడ జంక్షన్ నుంచి గిరిజన గ్రామం అణుకు వరకు ఐదు కిలోమీటర్ల రోడ్డుకు రూ.3 కోట్లుసబ్బవరం మండలంలో బీఎన్‌రోడ్ నుంచి ఒమ్మివానిపాలెం మీదుగా ఏఎస్‌పల్లి వరకు 8.15 కి.మీ.ల రోడ్డు మరమ్మతులకు రూ.1.1 కోట్లు

8ఎంకేపీ2 లచ్చన్నపాలెం- కుసర్లపూడి రోడ్డు అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు. పక్కనే చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఉన్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

రహదారులతో గ్రామాల్లో భూముల విలువ పెరుతుంది

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

రూ.2.6 కోట్లతో లచ్చన్నపాలెం- కుసర్లపూడి రోడ్డు అభివృద్ధికి శంకుస్థాపన

రహదారుల నిర్మాణంతో గ్రామాల అభివృద్ధితో పాటు వ్యవసాయ భూముల విలువ పెరుగుతుందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆదివారం మాకవరపాలెం మండలం లచ్చన్నపాలెం నుంచి రోలుగుంట మండలం కుసర్లపూడి వరకు రూ.2.6 కోట్లతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే రోలుగుంట వాసులు అనకాపల్లి, విశాఖపట్నం వెళ్లడానికి నర్సీపట్నం రావాల్సిన అవసరం వుండదన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. ముఖ్యంగా గ్రామీణ రహదారుల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నదని చెప్పారు. మాకవరపాలెం మండలంలో రూ.4.94 కోట్లతో 47 సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ మండలంలో రాచపల్లి సెంటర్ నుంచి కోటవురట్ల మండలం కైలాసపట్నం వరకు 7.77 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధికి రూ.4.6 కోట్లు, గిడుతూరు నుంచి రాజుపేట వరకు రూ.9.6 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. అనంతరం స్వచ్ఛ ర?థాన్ని ప్రారంభించి దాని ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఎంపీడీవో ఛాయసుధ, తహసీల్దార్ బాణం వెంకటరమణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, నాయకులు పోతల రాంబాబు, రుత్తల జోగిపాత్రుడు, అల్లు రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య లడ్డూలకు ప్రత్యేక నెయ్యా?

**అంటే తిరుమల ప్రసాదంలో కల్తీ నిజమేనా?**

**ఈ విషయం గురించి మీకు ముందే తెలుసా?**

**దుర్మార్గానికి పాల్పడి ఎదురుదాడికి సిగ్గులేదా?**

**భూమన, పేర్నిపై మంత్రి నాదెండ్ల మనోహర్ ధ్వజం**



**క్రైమ్ కౌంటర్ న్యూస్):** తెనాలి, ఫిబ్రవరి 8 "అయోధ్యకు పంపిన లడ్డూ ప్రసాదాన్ని వేరే డెయిరీల నుంచి తెప్పించిన ప్రత్యేక నెయ్యితో తయారు చేశామని మీరే చెబుతున్నారంటే ఆ ఐదేళ్లలో భక్తులకు పంచిన తిరుమల లడ్డూ తయారీకి వాడింది కల్తీ నెయ్యేనని ఒప్పుకున్నట్టే కదా! ఈ కల్తీ విషయం కూడా మీకు ముందే తెలుసా! ఇంత దుర్మార్గం తెలిసే చేసి కూడా ఈ ఎదురుదాడేంటి? మీకసలు సిగ్గే లేదా?" అంటూ వైసీపీ నేతలపై మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్రంగా మండిపడ్డారు. చౌకధరల దుకాణం ద్వారా కిలో రూ.20కే గోధుమపిండి అందించే కార్యక్రమాన్ని ఆదివారం ఆయన గుంటూరు జిల్లా తెనాలిలో ప్రారంభించారు. తర్వాత మంత్రి విలేకరులతో మాట్లాడారు. అయోధ్యకు పంపిన లడ్డూలను ప్రత్యేక నెయ్యితో తయారు చేయించామని వైసీపీ నాయకులు కరుణాకరరెడ్డి, పేర్ని నాని చెప్పడంపై విస్మయం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు చెందిన వి.కె. డెయిరీ ఎసెన్షియల్స్, పలమనేరుకు చెందిన పరాగ్ మిల్క్ ఫుడ్స్ అనే రెండు సంస్థల నుంచి 2,010 కిలోల స్వచ్ఛమైన నెయ్యి తీసుకుని అయోధ్యకు లడ్డూలు తయారు చేసి పంపామని వారు చెప్పడంపై మండిపడ్డారు. ఆ లక్ష లడ్డూల తయారీలో వేరే నెయ్యి వాడామని చెబుతున్నారంటే, వారు అధికారంలో ఉన్న ఐదేళ్లలో భక్తులకు పంపిణీ చేసిన లడ్డూల తయారీకి కల్తీ నెయ్యి వాడారని తేలిపోయిందని మంత్రి మనోహర్ పేర్కొన్నారు.

## లడ్డూ కల్తీకి జగనే బాధ్యుడు: పల్లా

**క్రైమ్ కౌంటర్ న్యూస్):** విశాఖపట్నం, ఫిబ్రవరి 8 తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీకావడానికి మాజీ సీఎం జగనే బాధ్యుడని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఈ దుర్మార్గానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.



# సీఎం చంద్రబాబు సంస్థ హెరిటేజ్‌కు భారీ జరిమానా

చంద్రబాబు కుటుంబ సంస్థ 'హెరిటేజ్' బండారం బట్టబయలు హెరిటేజ్ 'టోటల్ కర్డ్' అత్యంత నాణ్యతలేనిదిగా నిర్ధారణసబ్-స్టాండర్డ్' ఉత్పత్తి అని ఖీరూరా× నిర్ధారణ నిబంధనలు ఉల్లంఘించి నాణ్యత లేని పెరుగు విక్రయం నాణ్యతలేని పెరుగు విక్రయిస్తున్న హెరిటేజ్ కు జరిమానా పెరుగులో కనీస పాలకొవ్వు లేదని తేల్చిన అధికారులు. ఫుడ్ సేఫ్టీ & స్టాండర్డ్స్ యాక్ట్ కింద రూ.లక్ష పెనాల్టీ తప్పు ఒప్పుకున్న హెరిటేజ్ యాజమాన్యం పెనాల్టీ కడతామంటూ సెబీకి నివేదిక ప్రజల ఆరోగ్యంతో చంద్రబాబు సంస్థ చెలగాటంనాణ్యతలేని పెరుగును మార్కెట్లోకి వదిలిన తీరుపై విమర్శలు బ్రాండ్ పేరుతో హెరిటేజ్ మోసం హెరిటేజ్ ఉత్పత్తుల్లో నాణ్యత లోపంపై సర్వత్రా ఆగ్రహం దీంతో హెరిటేజ్ ఉత్పత్తుల నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# సినిమా



## ఏడు ఫ్లాప్‌ల తర్వాత నాగార్జునకు హిట్ ఇచ్చిన చిత్రం ఏదో తెలుసా.?

అక్కినేని నాగార్జున సూపర్ హిట్ చిత్రం 'ప్రెసిడెంట్ గారి పెళ్ళాం' వెనుక స్టోరీని రచయిత తోటపల్లి మధు గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో వివరించారు. 90వ దశకం ఆరంభంలో తాను చాలా బిజీగా ఉన్న సమయంలో, చిరంజీవి కోసం ఒక గ్రామీణ నేపథ్యం కలిగిన విభిన్నమైన కథను సిద్ధం చేయాలనే ఆశ మధుకు ఉండేదట. అక్కినేని నాగేశ్వరరావు నటించిన మంచి రోజులు వచ్చాయి చిత్రం నుంచి ఒక ఔట్‌లైన్‌ను తీసుకొని, రెండవ భాగాన్ని పూర్తిగా మార్చి, కొత్త పాత్రలతో ఈ కథను తీర్చిదిద్దారు. మొదట ఈ కథను కోదండరామిరెడ్డికి వివరించగా, ఆయన దీనిని పెద్ద హీరోలకు కాకుండా చిన్న హీరోలకు సరిపోతుందని అభిప్రాయపడ్డారు.

కొంతకాలం తర్వాత నిర్మాత దొరస్వామిరాజు నుంచి పిలుపు వచ్చింది. నాగార్జున కోసం కథ చెప్పమని అడగగా, మధు వెంటనే అంగీకరించారు. విమాన ప్రయాణంలోనే దొరస్వామిరాజుకు కథా వివరించగా, ఆయనకు బాగా నచ్చింది. అప్పట్లో కథ చెప్పకముందే అడ్వాన్స్ తీసుకునే అలవాటు మధుకు ఉండగా, దొరస్వామిరాజు వెంటనే అడ్వాన్స్ ఇచ్చారు. హైదరాబాద్ చేరుకున్నాక, అన్నపూర్ణ స్టూడియోలో వెంకట్ అక్కినేని, దొరస్వామిరాజు, కోదండరామిరెడ్డిలకు కథను వివరించారు. మధు తన స్పాట్ ఇంప్రొవైజేషన్ నైపుణ్యంతో, డైలాగులతో సహా నాగార్జునకు 1 గంట 45 నిమిషాల పాటు కథను వివరించారు. నాగార్జున ఈ కథ విని ఎంతో హ్యాపీగా ఫీల్ అయ్యి, మధును కౌగిలించుకుని, ఈ సినిమా మాత్రమే కాదు, నా తదుపరి చిత్రాలకు కూడా మీరే రాయాలి అని కోరారు. అలాగే మద్రాసు నుంచి హైదరాబాద్ వచ్చేయమని పదేపదే చెప్పారు.

ఈ చిత్రంలో నాదముని అనే పాత్రను తాను సృష్టించినప్పుడు, ఆ పాత్రను కోట శ్రీనివాసరావు చేయాలనుకున్నట్లు మధు తెలిపారు. అయితే, నాగార్జున మాత్రం కోట కాదు.. తాను చేస్తే చాలా బాగుంటుంది అని మధును బలవంతం చేశారట. తనకున్న కమిట్‌మెంట్ల కారణంగా(ఏడాదికి 20 చిత్రాలు రాయాలి), మధు సున్నితంగా తిరస్కరించారు. ఈ చిత్రంలో చంద్రమోహన్ పాత్ర ప్రాధాన్యతను మధు నొక్కి చెప్పారు. ఈ సినిమా తీస్తే చంద్రమోహన్ కోసమే తీయాలి అని పట్టుబట్టి, కోదండరామిరెడ్డితో చంద్రమోహన్‌ను ఎంపిక చేయించారు. మా అమ్మ నాన్న పెరుమాళ్ళు, మా ముత్తాత నాగయ్య లాంటి డైలాగులు చంద్రమోహన్ చెబితేనే సహజంగా ఉంటాయని మధు వివరించారు.

దొరస్వామిరాజు తనకు మద్రాసులో పాండి బజార్‌లో ఫ్లాట్ కొనుక్కోవడానికి డబ్బు ఇచ్చిన కృతజ్ఞతతో మధు గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రానికి కన్నడ రీమేక్ హక్కుల విషయంలో దొరస్వామిరాజు మధుకు అదనంగా రెండు లక్షలు చెల్లించి, హక్కులు తీసుకున్నారని, అయితే 1992లో కన్నడలో రీమేక్‌లు చేయకూడదని ఒక రూల్ ఉండటంతో రీమేక్ ఆగిపోయిందని మధు తెలిపారు. ఆ తర్వాత సాయిప్రకాశ్ అనే దర్శకుడు అడగగా, మధు హళ్లి హీరో పేరుతో శివరాజ్ కుమార్ హీరోగా అదే కథను మార్చి కన్నడలో చేసి విజయం సాధించారు. దొరస్వామిరాజు డబ్బుకు ఆశపడకుండా, మీరు సొంతంగా చేసుకోండి అని చెప్పిన మంచితనానికి మధు ఎంతో రుణపడి ఉన్నారట. ప్రెసిడెంట్ గారి పెళ్ళాం అద్భుతమైన టీమ్ వర్క్‌తో రూపొందిన గొప్ప చిత్రమని తోటపల్లి మధు ఈ సందర్భంగా ప్రశంసించారు.





## ఉప్పు, జామకాయ కలిపి తింటున్నారా..?

విటమిన్ సి, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉన్న జామకాయ ప్రయోజనాలు దాని రుచిని మించి ఉంటాయి. దాని తీపి, ఉప్పగా ఉండే రుచితో జామ మీ రోగనిరోధక శక్తిని పెంచడం నుండి జీర్ణక్రియను మెరుగుపరచడం, మీ చర్మాన్ని మెరిసేలా చేయడం వరకు అనేక విధాలుగా మేలు చేస్తుంది. జామకాయలో ఆపిల్ కంటే 10 రెట్లు ఎక్కువ ప్రోటీన్, మూడు నారింజల కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. చాలా మంది ఆరోగ్యకరమైన జామకాయలను ఉప్పుతో తింటారు. ఇలా తినటం సరైనదేనా..? దీని వల్ల శరీరంలో ఏం జరిగేది ఏంటో ఇక్కడ చూద్దాం...

జామకాయను ఉప్పుతో కలిపి తింటే ఏమవుతుంది?

జామకాయను ఉప్పుతో ముఖ్యంగా నల్ల ఉప్పు, లేదా రాతి ఉప్పుతో కలిపి తినడం వల్ల దాని ప్రయోజనాలు పెరుగుతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అదనపు విటమిన్ సిని అందిస్తుంది. రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది. ఉప్పు జామ రుచిని పెంచడమే కాకుండా ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేస్తుంది. అయితే, మీకు అధిక రక్తపోటు ఉంటే, తక్కువ ఉప్పును వాడండి. జామపండును ఉప్పుతో తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇక్కడ చూద్దాం.. 1. జీర్ణక్రియ మెరుగుపడుతుంది–

జామకాయలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది నల్ల ఉప్పుతో కలిపితే మలబద్ధకం, ఆమ్లత్వం, ఉబ్బరం నుండి ఉపశమనం కలిగిస్తుంది. కాబట్టి, కడుపు సమస్యలను తగ్గించడానికి, మీరు ఖచ్చితంగా జామకాయను నల్ల ఉప్పుతో తినాలి.

2. రోగనిరోధక శక్తిని పెంచుతుంది–

జామపండ్లలో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఉప్పు ద్రవ సమతుల్యతకు కూడా సహాయపడుతుంది. ఇది రోగనిరోధక శక్తికి గొప్ప కలయికగా మారుతుంది.

3. గుండె ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోండి–

జామపండ్లలోని యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్), రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. ఉప్పు ఎలక్ట్రోలైట్ సమతుల్యతకు సహాయపడుతుంది.

4. రక్తంలో చక్కెర నియంత్రణ–

జామపండ్లలోని ఫైబర్, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి. జామపండ్లకు ఉప్పు వేసుకోవడం వల్ల అదనపు రుచితో పాటు అనే ప్రయోజనాలను పొందవచ్చు.

5. బరువు నియంత్రణలో సహాయపడుతుంది–

ఉప్పు జామ రుచిని పెంచుతుంది. జామలోని ఫైబర్ మీకు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఇది బరువు నియంత్రణకు సహాయపడుతుంది.



## మీ శరీరంలో అద్భుతాలు చేసే మ్యాజిక్..

మనం ప్రతిరోజూ వంటల్లో రుచి కోసం, సువాసన కోసం కరివేపాకును వాడుతుంటాం. చాలామంది తింటున్నప్పుడు దాన్ని తీసి పక్కన పడేస్తారు. కానీ కరివేపాకు కేవలం ఒక మసాలా దినుసు మాత్రమే కాదు.. అది ఒక అద్భుతమైన నేచురల్ హెల్త్ టానిక్ అని ప్రముఖ యోగా గురువు డాక్టర్ హంస యోగేంద్ర వివరిస్తున్నారు. కేవలం 14 రోజుల పాటు క్రమం తప్పకుండా కరివేపాకును తీసుకుంటే శరీరంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఆమె స్పష్టం చేశారు.

కరివేపాకులో ఏముంది?

ఆయుర్వేదం ప్రకారం కరివేపాకు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇందులో.. విటమిన్లు ఏ, బీ, సీ, ఈ లతో పాటు ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇది డయాబెటిస్ నిరోధక, గుండె రక్షణ లక్షణాలను కలిగి ఉంటుంది.

14 రోజుల ప్రయాణం -- శరీరంలో కలిగే మార్పులు

జీర్ణ వ్యవస్థకు పునరుజ్జీవం

కరివేపాకు జీర్ణ ఎంజైమ్‌లను యాక్టివ్ చేస్తుంది. దీనివల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు 14 రోజుల్లో క్రమంగా తగ్గుముఖం పడతాయి.

యవ్వనాన్ని కాపాడుతుంది

ఇందులోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరిస్తాయి. ఇది కణాల క్షీణతను అడ్డుకుని, వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదింపజేస్తుంది.

జుట్టు -- చర్మ సౌందర్యం

కరివేపాకులో ఉండే బీటా–కెరోటిన్, ప్రోటీన్లు జుట్టు కుదుళ్లను బలోపేతం చేస్తాయి. జుట్టు రాలడం తగ్గడమే కాకుండా, చర్మానికి సహజమైన మెరుపు వస్తుంది.

షుగర్ కొలెస్ట్రాల్ నియంత్రణ

కరివేపాకు ఇన్సులిన్ కార్యకలాపాలను మెరుగుపరిచి రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేస్తుంది. అలాగే చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్‌లను తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఎలా తీసుకోవాలి?

డాక్టర్ హంసాజీ సూచనల ప్రకారం.. ఉదయాన్నే 4–5 తాజా కరివేపాకులను నమిలి గోరువెచ్చని నీరు తాగాలి. మజ్జిగలో కరివేపాకు కలిపి తీసుకోవడం వల్ల చలవ చేస్తుంది. ఆహారంలో కరివేపాకు పొడి లేదా చట్నీ రూపంలో చేర్చుకోవచ్చు.

## తొలుత వద్దన్నారని హాలీడే ప్లాన్.. కట్‌చేస్తే..

తొలుత సెలెక్టర్లు వద్దనుకున్నారు. దీంతో జర్మనీలో దీర్ఘకాలిక సెలవులు గడిపేందుకు ప్లాన్ చేసుకున్నాడు. అలాగే స్పెయిన్‌కు వెళ్లి రియల్ మాడ్రిడ్ మ్యాచ్ చూడ్డానికి కూడా ప్లాన్ చేసుకున్నాడు. హైదరాబాద్‌లో ఉన్న తన స్నేహితులకు ఈ ప్లాన్ గురించి తెలిపాడు. అయితే, ఈలోపే భారత జట్టు ట్రైనర్ అడ్రియన్ లె రూక్స్ నుంచి కాల్ వచ్చింది. తనను డిస్టర్బ్ చేయవద్దని, నేను భారీగా ప్లాన్ చేసుకున్నాను అని కూడా చెప్పాడు. కానీ, శుక్రవారం రాత్రి వరకు ముంబైకి రావాల్సిన అవసరం ఏంటో చెప్పాడు. భారత జట్టు నుంచి పిలుపు రావడంతో.. తన టూర్ ప్లాన్ మొత్తం క్యాన్సిల్ చేసుకున్నాడు. వెంటనే దేశం తరపున తన బాధ్యతను నెరవేర్చేందుకు ముంబై వెళ్లాడు. వెంటనే టీమిండియా ప్లేయింగ్ 11లో పేరు చూసి షాకయ్యాడు. ఆ వెంటనే అంటే, 24 గంటల లోపే, అమెరికా జట్టుతో జరిగిన కఠినమైన మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంలో హీరోగా మారి ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారిపోయాడు మన హైదరాబాదీ పేసర్ సిరాజ్. 24 గంటల్లో తన ప్లాన్ ఎలా మారిపోయిందో గుర్తు చేసుకుని షాక్ అయ్యాడు సిరాజ్. ఈ క్రమంలో ఫ్యాన్స్ కూడా తెగ సంబరపడిపోతూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ క్రమంలో అసలేం జరిగిందో సిరాజ్ చెప్పుకొచ్చాడు.రెడీ అవ్వు.. బ్యాగ్ సర్దుకో అంటూ కాల్..

ఆయన మాటల్లోనే.. "అప్పుడే సడెన్‌గా సూర్య భాయ్ (కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్) నాకు కాల్ చేశాడు. 'రెడీ అవ్వు, బ్యాగ్ సర్దుకో, వచ్చేయి' అన్నాడు. నేను 'సూర్య భాయ్, జోక్ చేయొద్దు, ఇది జరగదు' అన్నాను. ఆయన 'నిజం చెబుతున్నాను, రెడీ అవ్వు' అన్నాడు. ఫోన్ పెట్టిన వెంటనే నేషనల్ సెలెక్టర్ (ప్రజ్ఞాన్) ఓజా నుంచి కాల్ వచ్చింది. అలా ఒక్కసారిగా షాకింగ్ న్యూస్ తెలిసింది" అంటూ సిరాజ్ తెలిపాడు.

దేవుడు రాసిన విధి..

గాయపడిన హర్షిత్ రాణా స్థానంలో భారత జట్టులో చేరేందుకు మహ్మద్ సిరాజ్‌కు బ్యాగులు సర్దుకుని వెంటనే ముంబైకి ఫ్లైట్ ఎక్కేందుకు చాలా తక్కువ సమయం మాత్రమే దొరికింది. "దేవుడు రాసిన విధిని ఎవరూ మార్చలేరు. నేను వచ్చాను, మ్యాచ్ ఆడాను -- అన్నీ ముందే రాసి ఉన్నాయి. దేవుడు గొప్పవాడు. దాని మించినది ఎవరూ చేయలేరు" అంటూ సిరాజ్ చెప్పుకొచ్చాడు.



## వడ్డీతో సహా ఇచ్చిపడేశారుగా..

ఎట్టకేలకు న్యూజిలాండ్ 2024 ప్రపంచ కప్‌లో తమ ఓటమికి ప్రతీకారం తీర్చుకుంది. అఫ్గానిస్తాన్ రెండేళ్ల క్రితం 2024 టీ20 ప్రపంచ కప్ లో న్యూజిలాండ్ జట్టును 75 పరుగులకే కట్టడి చేసింది. దీంతో 84 పరుగుల తేడాతో కివీస్ పై ఘన విజయం సాధించింది. 2026 టీ20 ప్రపంచకప్ లో గ్రూప్ డీలో భాగంగా జరిగిన మ్యాచ్ లో టిమ్ సీఫెర్ట్, గ్లెన్ ఫిలిప్స్ ల అద్భుతమైన ఇన్నింగ్స్ తో ప్రతీకారం తీర్చుకుంది. 5 వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్ జట్టును మట్టికరిపించి విజయంతో న్యూజిలాండ్ ఈ టోర్నీని మొదలుపెట్టింది. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘాన్ జట్టు 183 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం న్యూజిలాండ్ జట్టు 17.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టపోయి ఈ లక్ష్యాన్ని చేరుకుంది.

ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ 42 బంతుల్లో 65 పరుగులు చేశాడు. గ్లెన్ ఫిలిప్స్ 42 పరుగులు జోడించగా, మార్క్ చాప్మన్ 17 బంతుల్లో 28 పరుగులు చేశాడు. డారిల్ మిచెల్ 14 బంతుల్లో 25 పరుగులు, కెప్టెన్ మిచెల్ సాంట్నర్ 8 బంతుల్లో 17 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఫిన్ అలెన్ ఒక పరుగుకు ఔటయ్యాడు. రాచిన్ రవీంద్ర గోల్డెన్ డక్‌గా ఔటయ్యాడు.

గుల్బాదిన్ నయీబ్ హాఫ్ సెంచరీ..

ఆఫ్ఘాన్ తరపున గుల్బాదిన్ నాయిబ్ హాఫ్ సెంచరీ చేశాడు. దీంతో ఆఫ్ఘాన్ 6 వికెట్లకు 182 పరుగులు చేసింది. గుల్బాదిన్ (63 పరుగులు, 35 బంతులు), సెదికుల్లా అటల్ (29 పరుగులు, 24 బంతులు) మూడో వికెట్‌కు 51 బంతుల్లో 79 పరుగులు జోడించారు. కానీ, నెమ్మదిగా ఉన్న పిచ్‌పై పరుగులు సాధించడం కష్టంగా అనిపించింది. ఫెర్గూసన్ ఆరో ఓవర్ చివరి బంతికి గ్లెన్ ఫిలిప్స్‌కు క్యాచ్ ఇచ్చి ఓపెనర్ ఇబ్రహీం జాద్రాన్ (10)ను ఔట్ చేశాడు. గుల్బాదిన్ 29 బంతుల్లో తన అర్ధ సెంచరీని చేరుకున్నాడు. ఫాస్ట్ బౌలర్ జాకబ్ డఫీ బౌలింగ్‌లో అతను రెండు సిక్సర్లు, ఒక ఫోర్ బాదాడు. గుల్బాదిన్, దర్వేష్ రసూలి (20 పరుగులు, 13 బంతులు) 17 బంతుల్లో 33 పరుగులు జోడించి ఆఫ్ఘనిస్తాన్ స్కోరును 150 దాటించారు. ఆ తర్వాత 18వ ఓవర్లో పార్ట్ టైమ్ స్పిన్నర్ రచిన్ రవీంద్ర బౌలింగ్‌లో గుల్బాదిన్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఇది చివరి ఓవర్లలో ఆఫ్ఘనిస్తాన్ రన్ రేట్‌ను ప్రభావితం చేసింది. అజ్మతుల్లా ఉమర్జాయ్ (14) రెండు సిక్సర్లు కొట్టి జట్టు స్కోరును 180 దాటించాడు.



Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.